# నారీ హృదయము




ఆ ఉత్తరాలన్నింటిలో లైటు బ్లూ కలర్ కవరు ఆమె నాకర్షించింది! చేతిలోనికి తీసుకొని ఫ్రమ్ అడ్రసు చూసింది. "అనూ" బి. ఏ., ఎ. సి. కాలేజీ గుంటూరు అని "గుండ్రంగా ముచ్చటగావున్న అక్షరాలు ఆమెకళ్లకు వక్రరేఖల్లా, చైనాఅక్షరాల్లా కనుపించాయ్. "ఎవరీ అనూ బి.ఏ." అనే ప్రశ్న ఆమెముందు నిల్చి నవ్వింది వికృతంగా. ఆమె మనసు రష్యన్ రాకెటుకంటె వేగంగా పనిచేస్తుంది. "అనూ" ఆయనగారి ఫ్రెన్డేమో....మరి 'అనూ' గురించి తనకెప్పుడూ చెప్పలేదే—కారణం? అవును! ఆమె ఆయనగారి ప్రేయసికావచ్చు! అందుకే కాబోలు తరచు గుంటూరు వెళ్తుంటారు! ఈ వూహ మనస్సులో ఉదయించగానే ఆమె హృదయ వల్మీకములో యీర్ష్యానర్పము తనకోటి పడగల నొక్కసారిగా విప్పి ప్రళయ నాట్యం చేసింది. అనుమానము ఆకాశములా విశాలంగా ఆమె మనస్సును కప్పివైచింది. బాధతో ఆమె హృదయము బరువెక్కింది. ఆమె ఉఛ్వాస నిశ్వాసాలు కొడెనాగుబుసల్లా గున్నాయ్! కవరులోనుండి కాగితాన్ని బయటకు తీసింది .... తెల్లగా పాల నురగవంటి సూపర్‌క్వాలిటీకాగితానికి పైభాగములో ఎడమ ప్రక్కగా వికసించిన కలువ .... కలువమీద వాలుతున్న గండుతుమ్మెద కలువమీదుగా 'Forget me not' అన్న యింగ్లీషు అక్షరాలు ప్రింటుచేయబడివున్నయ్. వణుకుతున్న చేతిలోనుండి జారిపోబోతూ, వెక్కిరిస్తున్నట్లు, తనవైపు చూసి నవ్వుతున్నట్లుందా వుత్తరం. రెండు చేతులతో గట్టిగా పట్టుకుంది.

డియర్ రాజూ:

నీ లేఖ అందినది అలనాడు దమయంతి నలకూబరులమధ్యహంస ప్రస్తుతము అనూ రాజుల ప్రేమహృదయాలమధ్య పోస్టల్‌వాళ్ళు చేసే సేవ మరువరానిది. వచ్చేనెల ఫస్టున యిక్కడకు వస్తానని వ్రాశావు. అబ్బ! ఫస్టుకే ఎందుకు రావు? ఓహ్ మరిచిపోయాను. వాణి చెల్లాయిని సినిమాకు తీసుకువెళ్తావుకదూ.... కనీసం ఫస్టుకయినా తప్పకుండా రావాలి.

నీ చేతిలోనికి నాచేతిని తీసుకుని 'అనూ' అనే వాడివి చిలిపిగా.

మనం స్కూల్‌ఫైనల్ చదువుతున్నపుడు నాగార్జునకొండ ఎక్స్‌కర్షన్ వెళ్ళాం జ్ఞప్తివుంది కదూ! అరుణారుణ సంధ్యాసమయంలో మనమిద్దరం ఒక నల్లబండరాయిమీద కూర్చున్నాం. అనూ యీ ప్రశాంతప్రకృతిలో కిలకిల గలగల నవ్వుతూ ఎత్తిపోతలమీదనుండిదూకి కొండలలోనుండి దారిచేసుకుని కృష్ణమ్మలో కలవటానికి ఉత్సాహంగా పరుగెట్టే చంద్రవంక పచ్చనిచెట్లమీదనుండి శుకపికాదిపక్షుల

— రచన: "ప్రేమశ్రీ" —

కిలకిలారావం అబ్బ! ఎంతప్రశాంతంగా, మనోహరంగావుంది....అనూ....మనిద్దరమూ ఇలా వుండిపోతే....అని ఎంతో ఉద్రేకంగ అన్నావు. మనిద్దరము కృష్ణవైపు నడుస్తున్నపుడు ఎన్నో తీయనికబుర్లు చెప్పావ్. నీవు కృష్ణలోస్నానం చేసి ఒడ్డుకొచ్చావు....ప్రభాకరుని కరుణమయ అరుణకిరణాలు నీ సువిశాలమైన బంగారు రంగు వక్షస్థలమ్మీదపడి రిప్లెక్టు అవుతున్నపుడు, ముత్యాల్లా నీటిబిందువులు నీ శరీరానికి అంటిపెట్టుకొనివున్నపుడు నిన్ను ఫోటో తీశాను. అప్పుడు అన్నానుకదూ 'రాజూ నీలో గ్రీకువీరుని అంగసౌష్టవం వుందని' ఏమీ మనసు బాగులేనప్పుడు ఆ నీ ఫోటోను ముందుంచుకుంటే కాలము యిట్టే పరుగెడుతుంది ఓ తీయని కలలా....

ఎంతో వ్రాద్దామనుకుంటాను కాని, కలం నడవదు. నా హృదయాన్ని అక్షరరూపంలో నీముందు ఎలా నమర్పించగలను!! ప్రయత్నిస్తాను.

పోయినవారం వీక్లీలో నీవు వ్రాసిన కథ చదివాను. అందులోకూడా నన్నే వర్ణించావ్ ఐనా నీవు వర్ణించినంత అందంగా వున్నానా? తను వలచింది రంభ; తను మునిగింది గంగ' అన్నట్లు!

ఈ ఉత్తరము అందినవెంటనే రిప్లైవ్రాయి (వ్రాయకుండా వుండలేవని నాకు తెలుసు)

ప్రేమాభి వందనాలతో

నీ 'అనూ' బి. ఏ.

ఆమెచేతులు వణుకుతున్నాయ్! ఆమె విశాలమైన నేత్రాలు వర్షిస్తున్నాయ్. ఎంత మోసం! ఎంత నటన! ఎంత అమాయకంగా నటిస్తారాయన సర్వం తనే అయినట్లు.

నెలరోజులక్రిందటి సంఘటన!

"ఏమిటండీ వ్రాస్తున్నారు?" అనడిగింది తను!

"ప్రేమకథ" తలపైకెత్తకుండానే జవాబిచ్చారాయన. తను ఆయన కూర్చున్నకుర్చీ వెనుకగావచ్చి, రెండుచేతులు ఆయన భుజాల మీదవేసి 'మీ కథలోని అమ్మాయి అందమయిందేనా?' అని తను అడిగింది చిలిపిగా. అందుకాయన 'ఆఁ చాలా అందమయింది! జగదేకసుందరి 'క్లియోపాత్రా'కంటె, ఇంత వరకు ఏ చిత్రకారునికుంచెకు, ఏ శిల్పివులికీ, ఏ కవికలానికీ అందనటువంటిది! అయినా 'నా రాణివాణి'ముందు రత్నంముందు రాయిలాంటిది" అంటూ తనవైపు చిలిపిగాచూసి బుగ్గమీద చిటికెవేసారు. "ఏమండీ! నేను అంత అందంగా వున్నానా?" అని సిగ్గుతో, అమాయకంగా ప్రశ్నించింది తను. వారు కుర్చీలోనుండి లేచి, తనను దగ్గరకుతీసుకుని

'వాణీ! ప్రపంచపుదృష్టిలో నేను ఒక గొప్ప రచయితను అడదాని అందాన్ని, మనస్తత్వాన్ని వర్ణించటములో స్పెషలిస్టని అయినా నీ అందాన్నిగాని, నీ కోమలమనస్తత్వాన్ని కాని వర్ణించటానికి ప్రయత్నించను....సఫలీకృతుణ్ణికాలేను, ఒకటిమాత్రము చెప్పగలను. నీ యీ అమాయకమైన విశాలనేత్రాలే నా హృదయాన్ని అమృతమయంచేసాయ్" అని మత్తుగా తన కళ్లను ముద్దుపెట్టుకున్నారు.... వారి పెదాలమీద నల్లగా కాటుకమరకలు. తను కిలకిలా నవ్వింది .... ఆయన గలగల నవ్వారు. ఆయన నవ్వు వాణి వీణానాదంలా మత్తెక్కించే మధువులావుంది. అది మరుపురాని తీయని అనుభూతి....శిథిలమైన మధుర స్వప్నం....ఆమె హృదయం బాధతో బరువెక్కింది....పడకగదిలోనికి పరిగెత్తి దిండులో ముఖము దాచుకుని బావురుమని యేడ్చింది.

* * *

ఆఫీసు గోడగడియాలం గణగణ ఐదు గంటలు కొట్టింది. తనముందున్న ఫైళ్ళను బీరువాలలోనర్ది, వరండాలోకొచ్చి సైకిలుతీసుకుని, అలవాటుప్రకారం ఆ ప్రక్కనేవున్న పూలంగడిలో వంద మల్లెపూలు, రెండు కట్టలు దవణం తీసుకుని రూపాయి నోటు అందించాడు రాజారావు.

"మంచి గులాబీలున్నాయ్! రెండివ్వమంటారా" నూటికి పదిపాళ్ళు చిలిపిగా నవ్వుతూ అడిగింది పూలరంగడిలచ్మి. లచ్మి యిచ్చిన చిల్లర లాల్చీ జేబులోవేసుకుని, పూలపొట్లం ఎడమచేతిలో తీసుకుని సైకిలెక్కాడు.

అతని ఆత్మ మైలున్నర అవతలవున్న వాణి సన్నిధిలో అతని భౌతిక శరీరం వేగంగా పోతున్న సైకిలుమీద....

వీధిచివరనుండి వాణికోసంచూసాడు కాని, ఆమె గుమ్మములో లేదు!! ప్రతిరోజు తను వచ్చేవేళకు నవ్వుతూ గుమ్మంలో నిలబడి కనుపించేది. మరి యీరోజు ఆలోచిస్తూ సైకిల్ని ఇంటిముందాపి బెల్‌కొట్టాడు. ఒక్క క్షణం నిరీక్షించి, సైకిల్ని వరండాలోపెట్టి, చెప్పులు ఒక ప్రక్కన విడిచి, పూలపొట్లం టేబుల్‌మీదపెట్టి "వాణీ! వాణీ!" అని కేకేసాడు....జవాబుగా పిల్లి మ్యావ్‌మ్యావ్‌మంది. వంటగదిలోకెళ్లిచూసాడు, లేదు పడకగదిలోకెళ్లాడు వాణి నిద్రపోతుంది. ఆమె లేత గులాబిబుగ్గలమీద కన్నీటిచారలు! ఎంతో బాధపడ్డాడు! ఆమె నిండైన నునుపైన బుగ్గల మీద తన రెండు చేతులువేసి మెల్లగా నిమురుతూ మెల్లగా "వాణీ! వాణీ!" అని పిలిచాడు. ఆమె కళ్ళువిప్పి అతన్ని అసహ్యంగా ఏవగింపుగా చూసి మంచముదిగింది. రాజారావు ఆశ్చర్యపోయాడు!

"ఏంవాణీ ఆ కన్నీటిచారలేంటీ? ఏం జరిగింది?" అన్నాడతను ఆదుర్దాగా, ఆమెభుజాలమీద చేతులేస్తూ; ఆమె అతని చేతులను దూరంగా నెట్టింది. అతను ఆమె వింతప్రవర్తనకు విస్తుపోయాడు!!



"ఏమిటీ వాణీ వింతప్రవర్తన?"

"అవును! చాలా వింతప్రవర్తన" అదోలా అందామె.

"నీమాటలు కూడా అదోలా వున్నాయ్!" అని ఆమెను దగ్గరకు తీసుకోబోయాడు. ఆమె దూరంగా జరిగింది.

నన్నుముట్టుకోబోకండి! వంటిమీదజెర్రులు ప్రాకినట్లుంటుంది" అన్నది వాణి అబ్బ! ఆమె మృదుమధురమైన వీణానాదంలావుండే ఆమె కంఠస్వరములో ఎంత కర్కశత్వము, ఎంత ఏవగింపు; ఎంత అనాదరణ, రాజారావుకి ఒకపక్క బాధ, ఒకప్రక్క ఆశ్చర్యం మరొకప్రక్క కోపం!!

"అసలు జరిగిందేమిటి, నే చేసిన తప్పేమిటి?" సాధ్యమయినంతవరకు కోపంగా అందామనుకున్నాడు. కాని బొంగురుగా, బాధగా, లీలగా కనుపించే కోపంతో మాత్రమే అనగల్గాడతను.

"బాగా వినండి! నా సర్వస్వం అని నమ్ముకున్నదే పరాయి సొత్తని యీరోజే తెలుసుకోగల్గాను. నమ్మిపట్టుకున్న మాధవీలతే కాలనాగై కాటువేస్తే ఎలావుంటుందో ఆలోచించండి! నా స్వభావం మీకు బాగా తెలుసు. తెలిసి కటీకి కాలకూట విషాన్నయినా సేవిస్తాను కాని, అది అమృతమయినా మరొకరి 'ఎంగిలి' అని తెలిసిన తరువాత దాన్ని స్వీకరించలేను. అందుకనే యీ క్షణంనుండి మీకు భార్యగా దాంపత్యజీవితాన్ని గడపలేను. అసలు యీ జీవితంమీదే అసహ్యం కలుగుతుంది. అయినా యింకా కొన్నాళ్ళు బ్రతకాలని నిశ్చయించుకున్నాను. ఎవరికోసమూ కాదు. నా గర్భములో నా రక్తంలో రక్తం పంచుకుని దినదినాభివృద్ధిచెందే ఏ పాపమూ ఎరుగని పసిగుడ్డును హత్యచేయలేను నేను

ఆత్మహత్యచేసుకుని" పొంగిపొరలే దుఃఖాన్ని ఆపుకోలేకపోయింది. రాజారావు కేమీ వాణి మాటలు అర్థముకాలేదు. కాని ఆమెనుండి వెలువడిన ప్రతి అక్షరములో స్థిరనిశ్చయము గోచరిస్తుంది.

"వెళ్లండి ఇక్కడనుండి వెళ్లండి! మీరు పీల్చి వదిలిన గాలిసోకినా విషవాయువులా వుంటుంది....బాగా జ్ఞప్తివుంచుకోండి! నేను చెప్పినమాటలు. ఈగదివైపు యిక ఎప్పుడూ రాకండి! వచ్చారా—నేను ప్రాణాలతో బ్రతకలేను ఆత్మహత్యచేసుకుంటాను. ఇందువలన రెండు హత్యలుచేసిన మహాపాపం మిమ్మల్ని రాత్రింబగళ్ళు పీడిస్తుంది చివరిమాటగా చెప్తున్నాను" అని మంచంమీదపడి భోరున యేడుస్తోంది వాణి.

రాజారావుకు ఆమెను అంటుకునే ధైర్యం లేదు. బరువుగా అడుగులేస్తూ బయటకు నడిచాడు. పార్కుకువెళ్ళి ఓమూలగా అట్టే జనసంచారంలేని స్థలంలో పచ్చనిగరికమీద వెల్లకిలాపడుకుని అతని మనసేమిటో ఆలోచిస్తుంది. రేడియోనుండి 'సంసారంసంసారం ప్రేమసుధాపూరం నవజీవనసారం' అని పాట వినిపిస్తుంది. ఈ పాట చాలా చక్కగా పాడతాడని లెక్కలేనన్ని అభినందనలు పొందిన తనకే అదేపాట కర్ణకఠోరంగావుంది. ఎందుకో ఆ రేడియోను ముక్కలుముక్కలుగా చేయాలనిపిస్తుంది. ఇక అక్కడ ఓ క్షణం ఉండలేకపోయాడు. తనకెదురుగా గులాబీకన్యలు చిలిపిగా నవ్వుతూ నిల్చున్నాయ్! చేతికందిన గులాబీలన్నిటినీ కాలిక్రిందవేసి నిర్దాక్షిణ్యంగా నలిపివేసాడు. పార్కునుండి తిన్నగా సినిమాహాలుకెళ్ళాడు. టిక్కెట్టుతీసుకుని లోనికెళ్లి కూర్చున్నాడు. తెల్లని కర్టనుమీద నల్లని అక్షరాలు 'లైలా మజ్నూ' ఎందుకో ఆ సినిమా చూడబుద్ధికాలేదు, బయటకొచ్చేసి బీచికెళ్ళాడు. ఎక్కడెక్కడో తిరిగాడు. రాత్రి ఒంటిగంటకు యింటికి చేరుకున్నాడు బజారంతా భయంకరంగా చీకటిగావుంది.

"కరెంటు పోయింది కాబోలు...."

"అవును! తన జీవితమునుండి కూడా ఇంకా ఆలోచించలేకపోయాడు. టేబుల్‌మీద చిన్న కిరసనాయిల్‌లైటు వెలుగుతుంది. ఆ ప్రక్కనే తను తెచ్చినపూలు, అతనికి ఎక్కడలేనికోపంవచ్చి పూలపొట్లాన్ని చింపి పూలను చేతులతో కాళ్లతో నలుపుతున్నాడు. ఆనిశ్చల నీరవనిశ్శబ్దనిశీథిలోనుండి వినిపించే శబ్దం అతని క్రూరకర్కశ కరాలలో నలిగిపోయే పూలకన్నియల గుండెల అంతిమమూల్గులా వుంది. రగ్గుకప్పుకునిపడుకున్నాడు కనీసం బట్టలయినా మార్చుకోకుండానే, ఎడతెరపిలేని ఆలోచనలు దారాలు తెగిన గాలిపటాల్లా చెదిరిన మబ్బుల్లా పెరిగిపోయిన నల్లపూసలా ఛీ! ఏమిటీ ఆలోచనలు — తనేం తప్పుచేసాడని భగవంతుడు యీ శిక్ష విధించాడు? తన ఇరవై రెండు వసంతాల జీవితాన్ని సింహావలోకనంచేసుకున్నాడు. తన నిష్కల్మష— నిర్మలహృదయుడు .... తను కనీసం కలలోనైనా వాణికన్యాయం తలపెట్టలేదు–అయినా ఆమె అర్థంలేకుండా ప్రవర్తిస్తుంది !!

ప్రపంచంలో వివిధ మనస్తత్వాలు గల మానవులున్నారు — వారిలో చాలా మంది ఎప్పుడో ఒకప్పుడు 'అశాంతి' (మానసికమైన) కిదాసులైనవారే....ఒక్కొక్కరు ఒకోవిధంగా ఉపశాంతిపొందుతారు. కొందరు మత్తుపదార్థాలు సేవించి. ప్రతిజీవికి యీ పాపపుణ్యాలతో, ధనికబీదవర్గాలతో, అజ్ఞానవిజ్ఞానవిచక్షణ లేకుండా సంపూర్ణ శాంతి యివ్వగల్గేది మృత్యువు. తాత్కాలిక శాంతి యివ్వగల్గేది ఒక్క నిద్రాదేవి గాఢకౌగిలిమాత్రమే. దయతో ప్రేమతో అతన్ని తన నునువెచ్చని గాఢకౌగిలిలో తీసుకుంది నిద్రాదేవి.

ఆలోచనలతో మనస్సు బరువెక్కింది .... అలాంటప్పుడు కావాల్సింది నిశ్శబ్దం. తన హృదయస్పందన వినిపించేంతటి నిశ్శబ్దం టక్‌టక్‌మని తన విధ్యుక్త ధర్మాన్ని నిర్వహించే 'టైమ్‌పీస్'ను చూస్తుంటే వాణికి మహా చెడ్డవిసుగు, కోపం కలిగింది. దాన్ని ఆపుచేసింది. మిణుకుమిణుకుమని వెలుగుతున్న ఆముదపుప్రమిదను పమిటతో ఆర్పి పడుకుంది. కాటుకలాంటి కటికచీకటి గదినిండా తన హృదినిండా ఎంతో ఆలోచించింది. వెన్నకన్న సున్నితమైన తన హృదయాన్ని వజ్రంకన్న కఠినంగా చేసుకుంటానికి ప్రయత్నిస్తుంది. పాలకోసం తల్లడిల్లె పసిపిల్లను హృదయానికి హత్తుకునే మాతృమూర్తిలా 'మనశ్శాంతి'కోసం తల్లడిల్లే వాణిని తల్లిలా తన హృదయానికేసి హత్తుకుని జోకొట్టింది నిద్రాదేవి.

★ ★ ★

ప్రతిరోజూ ఆ యింట్లోనుండి వినిపించే 'కిలకిల'లు గాజుల గలగలలు కాని, కనీసం మాటలయినా వినిపించటంలేదు. మత్తెక్కించే మల్లెలవాసనలతో చల్లని పిల్లవాయువులు ప్రసరించటంలేదు. అయినా కాలరథపు కంచుచక్రాలక్రింద రెండు రోజులు నలిగిపోయాయి. రాజారావు ప్రతిరోజూ ఆమెను పలకరిద్దామనుకునేవాడు కాని ఆత్మాభిమానం అడ్డుతగిలేది.

ఆరోజు శనివారం. సాయంత్రం అయిదింటికి యింటికి వచ్చాడు రాజారావు. గుమ్మములో నవ్వుతూ నిల్చున్నది వాణి. ఆశ్చర్యపోయాడు. అర్థములేకుండా లేచిన 'తుఫాను' అణగారిపోయినందుకు సంతోషించాడు. తనకిష్టమయిన ఆకుపచ్చ సిల్కుచీర వంకాయరంగు మఖమల్ బ్లౌజు ధరించి దేవతలా నిల్చునివుంది. ఎంత చిక్కిపోయింది పాపం! యీరెండురోజులనుండి నిరాహారదీక్ష కాబోలు పాపం! అతని హృదయంలో అమృతం చిలికింది. అయినా అతను ఆ భావాన్ని ప్రదర్శించలేను. సీరియస్‌గా యింట్లోకి తిన్నగా వెళ్లి, ముఖంచేతులు కడుక్కొనివచ్చి యీజీచేర్‌లోపడుకుని పేపరుచూస్తున్నాడు. అతను నిజంగా పేపరుచూస్తున్నాడా! ఉహూఁ పేపరు అడ్డంపెట్టుకుని, వాణి రాకకోసం నిరీక్షిస్తున్నాడు. వాణి ట్రేలో బిస్కట్లు, నేతిపకోడీలు ప్లాస్కుతో కాఫీ తీసుకునివచ్చి టేబుల్‌మీద పెట్టింది.

"ఏమండీ....ఏమండీ! మిమ్మల్నే" మెల్లగా పిల్చింది వాణీ....

రాజారావు ఒకసారి దృష్టిని, ఆకర్ణాంతము లాగిన బాణంలా, ఆమెవైపు సారించి మళ్ళీ పేపరులోనికి తలదూర్చాడు నోట్లో ఊరే లాలాజలాన్ని దిగమ్రింగుతూ....

"క్షమించండి! అనవసరంగా అపోహలుపడి మిమ్మల్ని అనరానిమాటలన్నాను పాపిష్టిదాన్ని, మిమ్మల్ని ఎంతోబాధపెట్టాను. ఇప్పుడు నిజం తెలుసుకున్నాను. క్షమించండి!క్షమించాననండీ" అంటూ రాజారావు కాళ్లను వాటేసుకుని బావురుమని యేడ్చింది వాణి.

రాజారావు ఆమె నునుపైన భుజాలనుపట్టుకుని లేవనెత్తాడు. వాణి రాజారావు ముఖంలోకి తిన్నగా చూడలేకపోయింది. అతను ఆమెను గాఢంగా హృదయానికేసి హత్తుకున్నాడు. ఆమె క్షమించాననండీ" అన్నది

అతని చెదిరిన జుట్టును సరిచేస్తూ. "క్షమిం చాను" ఏవిటి సంగతి అన్నాడతను అమాయ కంగా నవ్వుతూ....

ఆమె అతన్ని యీజీచైరులో కూర్చుండ పెట్టి పకోడీలు, బిస్కట్లుతినిపిస్తూ "ఏమండీ! మీ ఫ్రెండ్స్ గురించి నాకెప్పుడూ చెప్ప రేమండీ! మీ ఫ్రెండ్ అవసరాల నూకారావు మీకు వ్రాసిన యీ వుత్తరాన్ని చదివి అది ప్రేమలేఖ అనుకుని, అ త ని సంతకము "అనూ" అంటే "అనూరాధ" అని అపోహ పడి మిమ్మల్ని చాలా బాధపెట్టాను. మధ్యాహ్నం 'అనూ'నుండి మీకు కాలేజి మేగజైను వచ్చింది. అందులో సాహిత్యసమితి సభ్యుల ఫోటోలున్నాయి....ఒక ఫోటో క్రింద అవసరాల నూకూ రావు అని బ్రాకెటులో "అనూ" అని వుంది. అప్పుడు గాని నాకు జ్ఞానోదయం అయింది....అబ్బ! ఒకవేళ యీ మేగజైను రాకపోతే ఏమయ్యేదో. ఆలోచిస్తేనే వళ్ళు జలదరిస్తుంది." అందామె అతని విశాలమైన వక్షస్థలంలో ముఖందాచుకుంటూ....

"అనూ–వాడే నామొదటి ప్రేయసి .... ఒక సారి కాలేజి మేగజైనులో "అనూ" అనే పెన్ నేమ్‌తో ఒక కథ వ్రాశాడు .... ఫ్రెండ్సంతా వాణ్ణి "అనూ....అనూ" అని ఏడ్పించేవాళ్ళు ఆఖరికి వాడిమరదలు అంటే 'భవిష్యత్‌భార్య' అనుకో; సుందరికూడా వాణ్ణి ఏడ్పించేది. "బావా! ఇకనుండి నీపేరు "అనూ" నాపేరు "సుందరి"....నేను భర్త....నీవు మదీయ అర్థాంగివి" అని....బహుశా యీ సంవత్సరము వాళ్ళ పెళ్లి అవుతుందనుకుంటాను. మనమే వాళ్లపెళ్లిలో పెద్దలం అదికాదు. వాణ్ణి అనుమానంతో ఇంతతుఫాను లేవదీయకపోతే, తిన్నగా నన్ను అడక్కూడదూ "అనూ" ఎవరని? అర్థాంగివి .... నాపై సర్వాధికారిణివి అన్నాడు రాజారావు తేలికైన హృదయంతో నవ్వుతూ....

"అనూ అనే యీ మాయదారి 'పెన్‌నేమ్' పీకిపారేసి పూర్తిపేరుతో పిలిపించుకోబోతున్నాడట!. కాలేజీ అమ్మాయిలంతా ఏడ్పిస్తున్నారట" అంటూ ఆరోజు అనూనుండి వచ్చిన ఉత్తరాన్నందించింది....

రాజారావు ఉత్తరాన్ని చదువుతున్నాడు....

అఁ చూడు....వాణీ! సంక్రాంతికి వాళ్ళిద్దర్నీ యిక్కడకు రమ్మని వ్రాస్తాను....అబ్బ! బావా మరదలు ఎంతసరదాగా వుంటారని. మీ అన్నగారును మదీయ బావగారును అగు శ్రీ శ్రీ శ్రీ సీతారామాంజనేయస్వాముల వారిని కూడా పండగకి యిక్కడకు రమ్మని వుత్తరం వ్రాస్తాను. ఆ లెటర్‌పాడ్ అందుకో...."

ఆమె అతన్ని లతలా అల్లుకుంది.

"ఇటు .... చూడు వాణి...." అంటూ అతను ఆమె చుబుకాన్ని పట్టుకుని పైకెత్తి ఆమె కళ్లల్లో నీరుచూసి "ఛా....ఏడుస్తున్నావా పిచ్చిపిల్లా"

"ఏడ్వటంలేదండీ ఇవి ఆనంద-బాష్పాలు అబ్బ! మీరెంత శాంతస్వభావులండీ .... మీ లాంటి అమృత మూర్తిని భర్తగాగల్గిన నేను ఎంత అదృష్టవంతురాలను! పోయిన జన్మలో, మిమ్మల్ని పొందటానికి ఎన్నేళ్ళు ఘోర తపస్సు చేసెనో...." అంటూమె ఆనంద పారవశ్యములో అర్ధనిమీలిత నేత్రాలతో అతని అందమయిన క్రాపులోనికి తనవెళ్ళుపోనిస్తూ.

"మరి నేను నిన్ను అర్ధాంగిగాపొందటానికి ఎన్ని సంవత్సరాలు తపస్సు చేశానో" అతను మత్తుగా అంటూ ఆమె అందమయిన విశాల నేత్రాలను చుంబించాడు....

అతని పెదాలకు కాటుకమరకలు!

ఆమె "కిలకిల" నవ్వింది.... ★


## ఓట్టో లీలా సెంటు

ఎల్లప్పుడును మీరు మనస్సంతోషముగా ఉండవలయునన్న మా సెంటును ఉపయోగించవలయును. మీరు ఎన్నో సెంట్లను చూచియుందురు. ఈ సెంటును మీరు కొంచం చేతిగుడ్డకైనను, షర్టుమీదనైనను పూసిన మీరు ఆనందించుటయే కాక మీ ప్రక్కనవుండు వారందరు వాసనచూచి ఆనందింతురు. ఒకతూరి తీసి వాడినవారికి దీనిగుణము తెలియును.

డ్రామ్ బాటిల్ 1-కి రూ. 1=00

ధనలక్ష్మి అండ్ కో.,

త. పె. నం. 1376 — మదరాసు–1,


★★★★★★★★★★★★★★★★★★★★



★★★★★★★★★★★★★★★★★★★★

# వలపు-పిలుపు

రచన:

మారేమండ శ్రీనివాసరావు

అయ్యొయ్యొ మోసపోతినే
అతడు రాకపోయెనే
విరులదండ వాడబోయె
మరులు యెదను అధికమాయె

ఇంటనంటి ఒంటిగాను
జంట సఖుడు రాకపోయె
గంట గడువ కఠినమాయె
కంట నిదుర లేకపోయె

బాసచేసి వెడలినాడు
ఆనమదిలో పొదివినాడు
గాసిగాని గడపినాను
మాసమైన గడువదాయె

అందమైన ఆకసమున
చందమామ విందుచేసి
ఇందు శిశిరం సుంతయైన
డెందమునకు మోదమవదె

రావోయి ప్రియుడ
జాగేల సఖుడ—?
నీరాకకై దాని
నిలచియున్నది చాల

సెలయేటి గలగలల
ఒలికేటి పలుకులను

పండువెన్నెలలోని
మెండైన శీతమును

కోకిలల స్వరముల
వెడలేటి మధురిమల
అర్థమవ్వక బ్రతుకు
వ్యర్థముగ వుందిరా....
రార నా పరమాత్మా
చేరరా నీ చెలువను
కావరా యీ కామినిని....